## క్లుప్తంగా

### తూర్పుచెన్నంపల్లిలో ఫ్యామిలీ డాక్టర్

**వరికుంటపాడు:** మండలంలోని తూర్పుచెన్నంపల్లి గ్రామంలో శనివారం మండల వైద్యాధికారిణి కరిష్మా సిబ్బందితో కలిసి ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె గ్రామంలో 45 మంది రోగులను పరీక్షించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. మధ్యాహ్నం వైద్యశిబిరానికి రాలేని వ్యాధిగ్రస్తుల ఇళ్లకు వెళ్లి వైద్యసేవలందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో నిర్వహిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

### నేడు హనుమాన్ శోభాయాత్ర సన్నాహక సమావేశం

**ఆత్మకూరురూరల్:** ఆత్మకూరులో ఈ నెల 21వ తేదీన హిందూ చైతన్య వేదిక ఆధ్వర్యంలో నిర్వహించనున్న హనుమాన్ శోభాయాత్రకు సంబంధించి ఆదివారం సన్నాహక సమావేశం నిర్వహిస్తున్నామని హనుమాన్ భక్తులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆత్మకూరు పట్టణంలోని టెంకాయతోపులో ఉన్న కృష్ణమందిరంలో ఉదయం 11 గంటలకు జరిగే ఈ సమావేశంలో హనుమాన్ భక్తులు పాల్గొనాలని కోరారు.

### వైభవంగా కోదండ రామస్వామి ఉత్సవాలు


కోదండరామస్వామి గ్రామోత్సవం

**కలిగిరి:** కలిగిరి పంచాయతీలోని పాపనముసిలిపాళెంలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న శ్రీకోదండరామస్వామి ఉత్సవాలు శనివారం వైభవంగా ముగిశాయి. సీతారాములకు ప్రత్యేక అలంకరణ, విశేష పూజలు నిర్వహించారు. గ్రామోత్సవంలో భక్తులు సీతారాములను దర్శించుకుని నైవేద్యాలు సమర్పించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

### వెంకటేశ్వరస్వామికి విశేష పూజలు


ప్రత్యేకాలంకరణలో స్వామివారు

**పొదలకూరు :** పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్‌లో ఉన్న శ్రీలక్ష్మీగోదా సమేత వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం విశేష పూజలు నిర్వహించారు. తొలుత స్వామి అమ్మవార్లకు పల్లకిసేవ గావించారు. ప్రత్యేక అలంకరణలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. అభిషేకాలు, పూజలు జరిపించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

### ఆహార పొట్లాల అందజేత

**నెల్లూరు(అర్బన్):** పద్మావతి సెంటర్‌లోని హరిత వృద్ధాశ్రమంలో ఆహార పొట్లాలను శనివారం పంపిణీ చేశారు. పీహెచ్‌పీ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శేషయ్య భార్య అంజనీదేవి ఐదో వర్ధంతిని పురస్కరించుకొని కార్యక్రమాన్ని చేపట్టారు. నారాయణ డెంటల్ కళాశాల హెచ్‌ఓడీ నటరాజన్ కణ్ణన్, కేంద్ర ప్రభుత్వ ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ పరవస్తు నాగ సాయిసూరి, పీహెచ్‌పీ గౌరవాధ్యక్షుడు జయప్రకాష్, జిల్లా అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్, నేతలు దేవరకొండ శ్రీనివాసులు, ప్రసాద్, రసూల్, రామదాసు, వీరయ్య, విశ్రాంత ఏఎస్సై మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

### మదర్ కేర్ యూనిట్ ప్రారంభం

**నెల్లూరు(అర్బన్):** జిల్లాలో మాతా, శిశు మరణాలను తగ్గించాలనే లక్ష్యంతో ఉచిత కంగారు మదర్ కేర్ యూనిట్‌ను వసంతలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో శనివారం ప్రారంభించారు. దీనికి సంబంధించిన అన్ని పరికరాలతో కూడిన ప్రత్యేక అంబులెన్స్‌ను పొగతోటలో శనివారం ప్రారంభించారు. తొలుత పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రిచ్ చిన్నపిల్లల ఆస్పత్రి ఎండీ డాక్టర్ రవికుమార్ మాట్లాడారు. వెంటిలేటర్లు, మానిటర్లు, స్కానింగ్ యంత్రాలు తదితరాలతో కూడిన అంబులెన్స్‌లో ట్రస్ట్ వైద్య సిబ్బంది గ్రామాల్లోని గర్భిణుల వద్దకెళ్లి ముందస్తు పరీక్షలు చేస్తారని వివరించారు. ఐఓసీఎల్ డివిజనల్ రిటైల్ హెడ్ అనిల్‌కుమార్, మేనేజర్ నరేష్‌కుమార్, వసంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# అలంకారప్రాయంగా సంపద కేంద్రాలు

- రోడ్ల వెంబడి పేరుకుపోతున్న చెత్త
- పట్టించుకోని అధికారులు


అనంతసాగరం మండలంలో నిరుపయోగంగా ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం

**సోమశిల:** గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుపరిచేందుకు ప్రభుత్వం లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు అలంకారప్రాయంగా మారాయి. వీటికి తోడు చెత్త సేకరించేందుకు పంచాయతీలకు కేటాయించిన రిక్షాలు నిరుపయోగంగా ఉన్నాయి. పట్టించుకోవాల్సిన అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. రోడ్ల వెంబడి పేరుకుపోతున్న చెత్తను చూసి అంటువ్యాధులు ప్రబలుతాయేమోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గ్రామాల్లో నిర్మించిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్వహణను అధికారులు పట్టించుకోకపోవడంతో శిథిలావస్థకు చేరుతున్నాయి.

**చెత్త ఎక్కడ వేయాలో..**

అనంతసాగరం మండలంలోని 16 సచివాలయాల పరిధిలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు ఎందుకూ పనికిరాకుండా దర్శనమిస్తున్నాయి. లక్షల రూపాయలు ఖర్చు చేసి చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను నిర్మించారే కానీ వాటి నిర్వహణను పట్టించుకోవడం లేదు. గృహాల నుంచి చెత్తను సంపద కేంద్రాలకు తరలించేందుకు ప్రభుత్వం పంచాయతీలకు రిక్షాలు, ఇంటింటికీ రెండు చెత్త డబ్బాలను అందజేసింది. సంపద లేని కేంద్రాల్లో చెత్త ఎక్కడ వేయాలో తెలియక పలువురు రోడ్లపైనే వేస్తున్నారు. సంపద కేంద్రాలు ఉన్న గ్రామాల్లో వినియోగంలో లేకపోవడంతో ఆయా గ్రామాల్లో చెత్త పేరుకుపోతోంది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు చెత్త కారణంగా దోమలు వ్యాప్తి చెంది స్వైరవిహారం చేస్తున్నాయి. ప్రభుత్వ నిధులతో నిర్మించిన సంపద కేంద్రాలు వృథాగా పడి ఉండడంతో అధికారుల తీరును ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు. ఈ అంశంపై ఎంపీడీఓ తాజ్ మస్రూర్‌ను వివరణ కోరగా చెత్తను సంపద తయారీ కేంద్రాలకు తరలించేలా సచివాలయాల కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేస్తామని తెలిపారు.

### నేటి నుంచి అడవి పేరంటాలమ్మ ఉత్సవాలు


అడవి పేరంటాలమ్మ

**ఉదయగిరి:** మండలంలోని గన్నేపల్లిలో వెలిసిన అడవి పేరంటాలమ్మ ఉత్సవాలు ఆదివారం నుంచి గురువారం వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శనివారం తెలిపారు. ఆదివారం నిలుపు, సోమవారం, మంగళవారం గ్రామోత్సవాలు, బుధవారం పసుపు కుంకుమ ఉత్సవం, బండ్ల పందేలు, గురువారం పొంగళ్లు ఉంటాయని తెలిపారు. ఈ సందర్భంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. భక్తులు భారీగా తరలి వచ్చే అవకాశం ఉన్నందున ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు.

# విద్యార్థుల చేరికకు ముమ్మర కసరత్తు


బండారుపల్లిలో విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

**ఆత్మకూరురూరల్:** 'నేను బడికి పోతా' పేరుతో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్చుకొనేందుకు ఉపాధ్యాయులు ముమ్మర కసరత్తు చేస్తున్నారు. మండలంలోని బండారుపల్లి, వెన్నవాడ, బోయలచిరివెళ్ల, నాగులపాడు, కనుపూరుపల్లి తదితర గ్రామాల్లో ఉపాధ్యాయులు ఈ కార్యక్రమాన్ని ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు తల్లిదండ్రులతో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్కూళ్లను దీటుగా సౌకర్యాలు ఉన్నాయని, నాణ్యమైన విద్య అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పెంచలయ్య, అనిల్‌కుమార్, రాజేంద్రకుమార్, ఉపాధ్యాయులు ఇందూరు చంద్రమోహన్‌రెడ్డి, రామిరెడ్డి రామసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### 'నేను బడికి పోతా'పై ప్రత్యేక డ్రైవ్

- నీలగిరిసంగంలో ముగ్గురు చిన్నారులు పాఠశాలలో చేరిక


విద్యార్థుల తల్లిదండ్రులతో ఎంఈఓలు

**కొడవలూరు :** మండలంలోని గుండాలమ్మపాళెం మజరా నీలగిరి సంగం గిరిజన కాలనీలో ఎంఈఓలు జి.వసంతకుమారి, ఎస్.అంకయ్య శనివారం 'నేను బడికి పోతా'పై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. కాలనీకి చెందిన ఐదుగురు విద్యార్థులు కొడవలూరు జెడ్పీ హైస్కూల్‌లో 7, 8 తరగతులు చదువుతూ అర్ధాంతరంగా బడి మానేశారు. బడి ఈడు పిల్లలంతా బడిలోనే ఉండాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం నేను బడికి పోతా కార్యక్రమాన్ని ఈ నెల 13 నుంచి వచ్చే నెల 12వ తేదీ వరకు అమలు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు ఎంఈఓలు నీలగిరి సంగంలో శనివారం పర్యటించి బడి మానేసిన పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడారు. విద్య ద్వారానే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని, గిరిజన పిల్లలకు ప్రభుత్వం అనేక రాయితీలు కల్పిస్తున్నందున సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు పిల్లలను బడికి పంపేందుకు అంగీకరించారు. వెంటనే ఆ విద్యార్థులను కొడవలూరు హైస్కూల్‌లో 7, 8 తరగతుల్లో నమోదు చేశారు. సోమవారం నుంచి పిల్లలను యథావిధిగా బడికి పంపుతామని తల్లిదండ్రులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీఆర్‌ఎంటీలు ఎం.దయాకర్, జె.పెంచలరావు ఉన్నారు.

# పాఠశాలల పరిశీలన


మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ-2 ప్రభాకర్‌రెడ్డి

**సోమశిల:** అనంతసాగరం మండలంలోని మంచాలపల్లి జంగాల కాలనీ హైస్కూల్, కొత్తపల్లి హైస్కూళ్లను శనివారం ఎంఈఓ-2 ప్రభాకర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందజేశారా లేదా.. మధ్యాహ్న భోజనం అమలు తీరును ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. అలాగే పాఠశాలల్లో జరుగుతున్న నాడు-నేడు పనులను ఆయన తనిఖీ చేశారు. ఆయన వెంట ఉపాధ్యాయులు ఉన్నారు.

# అంగన్‌వాడీల బడిబాట ర్యాలీ


వరికుంటపాడులో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

**వరికుంటపాడు:** మండలంలోని వరికుంటపాడు మెయిన్, ఎస్సీ, ఆంధ్రావారిపల్లె, కనియంపాడు, రామాపురం ఎస్సీ, హుస్సేన్‌నగర్, భోగ్యంవారిపల్లె అంగన్‌వాడీ కేంద్రాల అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, చిన్నారులతో కలిసి శనివారం అంగన్‌వాడీ బడిబాట ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఐదేళ్ల లోపు చిన్నారులను తల్లులు అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పాలని కోరారు. ఈ కేంద్రాల్లో చిన్నారులకు పౌష్టికాహారం అందించడంతో పాటు పూర్వ ప్రాథమిక విద్య అందిస్తారన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

# రైతులకు అవగాహన


మాట్లాడుతున్న ఉద్యాన శాఖ అధికారిణి పి.లక్ష్మి

**చేజర్ల** మండలంలో ఎస్వీ కండ్రిక రైతు సభ్యులకు ఉద్యానవన అధికారిణి పి.లక్ష్మి శుక్రవారం కలెక్షన్ సెంటర్ ఉపయోగం గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్షన్ సెంటర్‌ను ఉద్యాన రైతు సంఘం సభ్యులు పండించిన ఉద్యాన ఉత్పత్తులను గ్రేడింగ్, ప్యాకింగ్ కోసం మాత్రమే ఉపయోగించాలని, మిగిలిన ఎలాంటి కార్యక్రమాలకు వినియోగించకూడదని తెలిపారు. కార్యక్రమంలో రైతు ఉత్పత్తిదారుల సంఘం వైస్ ప్రెసిడెంట్ తేళ్ల ఆదిశేషారెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకుడు పి.సూర్యనారాయణ, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# స్టూడెంట్ కిట్ల సరఫరాకు చర్యలు


పాఠశాలలకు స్టూడెంట్ కిట్లు సరఫరా చేస్తున్న ఎంఈఓ, సీఆర్‌పీలు

**జలదంకి:** మండలంలోని అన్ని పాఠశాలలకు స్టూడెంట్ కిట్లు సరఫరాకు చర్యలు చేపడుతున్నామని ఎంఈఓ-2 సీహెచ్ నాగేశ్వరరావు తెలిపారు. శనివారం స్థానిక మండల విద్యావనరుల కేంద్రం నుంచి ప్రభుత్వ పాఠశాలలకు వాహనాల ద్వారా స్టూడెంట్ కిట్లు సరఫరా చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ కలిగిరి మండలంలోని 45 ప్రాథమిక, 8 ప్రాథమికోన్నత, 5 ఉన్నత పాఠశాలలకు కిట్లను సీఆర్‌పీల ద్వారా పంపిణీ చేస్తున్నామన్నారు. 58 పాఠశాలలకు అవసరమైన 27,653 పాఠ్యపుస్తకాలను అందిస్తున్నట్లు తెలిపారు. అలాగే యూనిఫాం, నోటుపుస్తకాలు అందిస్తున్నామన్నారు. బ్యాగులు, షూలు త్వరలో కార్యాలయానికి వస్తాయని, వచ్చిన వెంటనే పాఠశాలలకు పంపిణీ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సీఆర్‌పీలు రవిచంద్ర, కొండయ్య, మాధవ, శ్రీనివాసులు, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

### పాఠ్యపుస్తకాల పంపిణీ



పాఠ్యపుస్తకాలు అందుకున్న విద్యార్థులు

**ముత్తుకూరు :** ముత్తుకూరులోని ఈదూరు ఈశ్వరమ్మ జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలను శనివారం పంపిణీ చేశారు. వేసవి సెలవుల అనంతరం పాఠశాలలకు 25 శాతం మాత్రమే విద్యార్థులకు హాజరవుతున్నారు. ఈ సందర్భంగా స్కూల్లోని 140 మందికి పాఠ్య పుస్తకాలను పంపిణీ చేసినట్లు హెచ్‌ఎం శ్రీనివాసులురెడ్డి తెలిపారు. మరోవైపు మొదటి సారిగా ప్రవేశపెట్టిన జూనియర్ ఇంటర్‌లో తొమ్మిది మంది విద్యార్థులు చేరారని తెలియజేశారు. ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని వెల్లడించారు.

### రక్తదాతలకు సత్కారం

**నెల్లూరు(బృందావనం):** ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని నెహ్రూ యువ కేంద్ర జిల్లా అధికారి మహేంద్రరెడ్డి పేర్కొన్నారు. నగరంలోని పురమందిర ప్రాంగణంలో గల వర్ధమాన సమాజ హాల్లో ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పినాకినీ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మురళీమోహన్‌రాజు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన పలువురికి ప్రాణదాత పురస్కారాలను ప్రదానం చేసి సత్కరించారు. మధుసూదన్‌రావు, కిరణ్‌కుమార్‌రెడ్డి, జీవన్‌కుమార్, ముత్తు, శరత్‌కుమార్, గొట్టిపాటి నిర్మల, వెంకటసుబ్బారావు, డాక్టర్ చీదరాల చెన్నయ్య, లక్ష్మీనారాయణ, గులామ్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

### పౌష్టికాహార పంపిణీ

**నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట):** నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నిర్వహిస్తున్న వేసవి క్రీడా శిబిరాల్లో శిక్షణ పొందుతున్న క్రీడాకారులకు పౌష్టికాహారాన్ని వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు సుబ్బరాజు మాట్లాడారు.

# దాతల దాతృత్వం


దాతలను సన్మానిస్తున్న ఆలయ ధర్మకర్త

**వరికుంటపాడు:** వరికుంటపాడులో పెండ్యాల సూర్యనారాయణ అమ్మాజీ దంపతుల ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన శ్రీపద్మావతి గోదా సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. రంగల భాస్కరరావు - శ్యామల దంపతుల కుమారుడు చైతన్యకుమార్ పుట్టినరోజు సందర్భంగా ఆలయానికి వచ్చిన భక్తులు అన్న ప్రసాద వితరణ చేశారు. అలాగే చైతన్యకుమార్ - ముగ్ధ మౌనిక దంపతులు, మందిపాటి అనుదీప్ - హారికదేవి దంపతులు ఒక్కొక్కరు ఐదు గ్రాములు బంగారాన్ని అమ్మవార్ల మంగళసూత్రాల నిమిత్తం ఆలయ ధర్మకర్త పెండ్యాల సూర్యనారాయణకు అందజేశారు. దాతలను ఆలయ ధర్మకర్త సూర్యనారాయణ ఘనంగా సన్మానించారు.

## ఆత్మకూరు వాసికి వాసవి క్లబ్స్ ప్రశంసాపత్రం



**ఆత్మకూరురూరల్:** ఆత్మకూరుకు చెందిన వాసవీయన్ నున్నా సంతోష్‌కుమార్‌కు సికింద్రాబాద్‌లో వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ వారు శనివారం ప్రశంసాపత్రం అందజేశారు. రెండు రోజులపాటు ఉభయ తెలుగు రాష్ట్రాల వారికి ట్రైన్ ది ట్రైనర్స్ వర్క్‌షాప్ నిర్వహించగా.. సంతోష్‌కుమార్‌కు వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ రవిచంద్రన్, చైర్మన్ సుదర్శన్, పైలెట్ ఫ్యాకల్టీ నాగేశ్వరరావు చేతులమీదుగా ప్రశంసాపత్రం అందజేశారు. పేర్ల వెంకట సత్యనారాయణ తదితరులు నున్నా సంతోష్‌కుమార్‌ను అభినందించారు.

## అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి


కృష్ణారెడ్డిపాళెం సెంటర్‌లో ప్రజలతో మాట్లాడుతున్న ఎస్సై సంతోష్‌రెడ్డి

**కలిగిరి:** గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై ప్రత్యేక దృష్టి సారించి కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై సంతోష్‌రెడ్డి తెలిపారు. నేరాల నియంత్రణపై కలిగిరి మండలంలోని కృష్ణారెడ్డిపాళెం పంచాయతీలో శనివారం ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో ఎవరూ వివాదాలకు దిగకూడదని తెలిపారు. గ్రామాల్లో సమస్యలు సృష్టించే వ్యక్తులపై కేసులు నమోదు చేస్తామన్నారు. పేకాట, కోడిపందేలు వంటి జూదాలు నిర్వహించిన, ఆడిన వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. అక్రమ మద్యం అమ్మకాలు చేపట్టరాదన్నారు. గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలు జరిగితే 9440700098 మొబైల్ నంబరుకు సమాచారం ఇవ్వాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

## ఎన్‌ఎంఎంఎస్ సాధించిన జమ్మవరం విద్యార్థులు


వైష్ణవిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

**అనుమసముద్రంపేట:** ఏఎస్‌పేట మండలం జమ్మవరం ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు మరోమారు ఎన్‌ఎంఎంఎస్ సాధించారు. ఈ విద్యా సంవత్సరంలో సీహెచ్ వైష్ణవి నేషనల్ మీన్స్ కమ్-మెరిట్ స్కాలర్‌షిప్‌నకు ఎంపికయ్యారు. 9వ తరగతి నుంచి నాలుగేళ్లపాటు సంవత్సరానికి రూ.12 వేల చొప్పున వైష్ణవికి స్కాలర్‌షిప్ అందనుంది. ఎన్‌ఎంఎంఎస్‌కు ఎంపికైన వైష్ణవిని ఎంఈఓలు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు శనివారం ఆ పాఠశాలలో అభినందించారు.

# ప్రజల దాహార్తి తీరుస్తున్న ట్రస్ట్


ఎంజీఆర్ బస్‌స్టేషన్ వద్ద మజ్జిగ పంపిణీ చేస్తున్న దృశ్యం

**ఆత్మకూరురూరల్:** సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలోని ఎంజీఆర్ బస్‌స్టేషన్, నెల్లూరుపాళెం కూడలి సెంటర్లలో మజ్జిగ, మంచినీరు అందజేస్తూ సేవానిరతిని చాటుతోంది. ఒక్క ఎంజీఆర్ బస్‌స్టేషన్‌లోనే ప్రతి రోజూ 600 మందికి మజ్జిగ పంపిణీ చేస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. ట్రస్ట్ అధినేత కంచి పరమేశ్వరరెడ్డి ప్రతిఫలాపేక్షలేకుండా చేస్తున్న సేవా కార్యక్రమాల పట్ల పలువురు అభినందనలు తెలిపారు.

## నేటి నుంచి అంకమ్మ, మల్లెంకొండయ్య దేవర్ల కొలుపు

**ఆత్మకూరురూరల్:** ఆత్మకూరు పట్టణంలో కొలువైన శ్రీఅంకమ్మ, మల్లెంకొండయ్య దేవర్ల కొలుపు ఉత్సవాలు ఆదివారం నుంచి 3 రోజుల పాటు నిర్వహించనున్నట్లు అంకమ్మతల్లి మందిర కార్యనిర్వాహకవర్గ ప్రతినిధులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 6 గంటల నుంచి వీరగంథం, 7 గంటలకు అంకమ్మతల్లి, మల్లెంకొండయ్య స్వామికి తొలి పూజ, మధ్యాహ్నం 2 గంటలకు అమ్మవారికి పెన్నా స్నానం, సాయంత్రం 6 గంటలకు నాగేంద్రపురం వినాయకుడి ఆలయం వద్ద నుంచి అమ్మవారి సింహాసనానికి ఊరేగింపు నిర్వహిస్తామని తెలిపారు. 17వ తేదీ ఉదయం 8 గంటలకు గిన్నెభిక్ష, 3 గంటలకు రాజు, ప్రధాని సాంగెములు, రాత్రి 8 గంటలకు అంకమ్మతల్లి హరికథ ఉంటుందని తెలిపారు. 18వ తేదీ ఉదయం మల్లెంకొండయ్య మాను వద్ద పట్నాలు కార్యక్రమం, సాయంత్రం 5 గంటలకు అమ్మవారి గ్రామోత్సవం నిర్వహిస్తామని తెలిపారు. ప్రతి రోజూ ఉదయం 8 గంటలకు అల్పాహారం, మధ్యాహ్నం 12 గంటలకు, రాత్రి 8 గంటలకు భక్తులకు అన్న సంతర్పణ నిర్వహిస్తామని తెలిపారు. భక్తులు పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకోవాలని కోరారు.

## నేటి నుంచి ప్రసన్నాంజనేయస్వామి ఉత్సవాలు


బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన ప్రసన్నాంజనేయస్వామి ఆలయం

**కొడవలూరు :** కొడవలూరులో వెలసిన శ్రీప్రసన్నాంజనేయస్వామికి ఆదివారం నుంచి నాలుగు రోజుల పాటు అత్యంత వేడుకగా బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తామని నిర్వాహకులు శనివారం తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం 3 గంటలకు సముద్ర స్నానం, రాత్రి 8 గంటలకు అంకురార్పణ, సోమవారం ఉదయం 9 గంటలకు శ్రీసీతారామ, లక్ష్మణ, హనుమత్ మూలమంత్ర హోమాలు, రాత్రి 9 గంటలకు విశేష పూజలు జరుగుతాయన్నారు. అదేవిధంగా మంగళవారం ఉదయం 9 గంటలకు స్వామివారికి విశేష పంచామృతాభిషేకం, సహస్ర నాగవల్లీ దళార్చన, సాయంత్రం 6 గంటలకు స్వామివారికి విశేష చందనాలంకరణ, పూలంగి సేవ, రాత్రి 9 గంటలకు స్వామివారికి విశేష అలంకారంతో గ్రామోత్సవం, బుధవారం సాయంత్రం 5 గంటల నుంచి విశేష ఉత్సవాలు జరుగుతాయన్నారు. భక్తులు స్వామివారి పూజల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.